# మాడ్రిడ్ డిక్లరేషన్

**తొలి అంతర్జాతీయ శాంతి సదస్సులో పాల్గొన్న మేమంతా ......**

ఈ **21**వ శతాబ్దం మన మధ్యకు తెచ్చిన పెను సవాళ్ళను ఆకళింపు చేసుకుని, వాటినుండి వ్యక్తిగతంగానైనా లేక సమిష్టిగానైనా సరే బయటపడాలంటే అందుకు ఇటు దేశీయంగానేగాక అటు అంతర్జాతీయంగా కూడా జాతి యావత్తూ ఏక మొత్తంగా సర్వ సన్నద్ధమై హింసా ప్రవృత్తి ప్రబలంగా వున్న సభ్య సమాజాన్ని శాంతికాముక జగత్తు వైపు మళ్ళించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్వసిస్తున్నాం.

మానవ హక్కుల సార్వత్రిక వడంబడిక, ఐక్యరాజ్య సమితి విద్యా సాంఘిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) వ్యవస్థాపన వంటి సమితి ప్రధాన ఆశయాలను, హక్కులపత్రంలోని ప్రధాన ఉద్దేశాలను ఉగ్గడిస్తూ 1999 సెప్టెంబర్ 13న జరిగిన ఐక్య రాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ ఆమోదించిన కార్యాచరణ ప్రణాళిక, తదనుగుణంగా విడుదల చేసిన అధికార ప్రకటనతో ఉత్తేజితులమైనాము.

**2000** నుండి **2010** మధ్య కాలాన్ని "ప్రపంచ బాలల శాంతి - అహింసా దశాబ్ది "గా ప్రకటిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభచే 1998 నవంబర్ 19న తీర్మానించబడి, 2000 నవంబర్ 20న ఆమోదింపబడిన ప్రకటనతో మరింత స్ఫూర్తి నొందాము.

**2000**వ సంవత్సరాన్ని "అంతర్జాతీయ శాంతి సంవత్సరం" గా ప్రకటించడమే గాక దీనికి అనువృత్తిగా **2001**వ సంవత్సరాన్ని "ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ నాగరిక సమాజాల సమాభాషణ సంవత్సరం" గా ప్రకటించిన 1998 నవంబర్ 16 నాటి సమితి తీర్మానాలను;

26 ఏప్రిల్ 2000న జరిగిన మానవ హక్కుల కమీషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదింపబడిన తీర్మానం ప్రకారం శాంతిని ప్రభోదించి పెంపొందించేందుకు గాను మానవ హక్కులను ప్రోత్సహించి పరిరక్షించేందుకు వీలుగా శాంతి ప్రతిష్టాపన మండలిని ఏర్పరచి సమన్వయ పర్చేందుకు హైకమీషనర్‌కు దఖలు పర్చబడిన అధికారాలను;

పరిగణన లోనికి తీసుకుంటూ –

2000వ సంవత్సరపు మానిఫెస్టో (విధాన ప్రకటన) లో పొందుపర్చి సాధికారికంగా ప్రకటించబడిన సిద్ధాంతాలు, వైఖరులకు అంగీకారం తెల్పుతూ సంతకం చేసి సభ్యత్వం స్వీకరించిన వేలాది సభ్యుల మద్దతును ప్రోత్సాహంగా స్వీకరించి,

1999 మే నెలలో వెలువడిన హేగ్ శాంతి విజ్ఞాపనను, "బాలలు–శాంతి" అంశంపై 2000 జూన్ మాసంలో చేసిన డెల్ఫి ప్రకటనలలోని ప్రత్యేక ప్రస్తావనలను మరో మారు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాము.

**అలాగే ......**

శాంతి ప్రతిష్టాపన కోసం ఐ.రా.స. సర్వ ప్రతినిధి సభ తన సమావేశంలో ప్రత్యేకించి పేర్కొన్న విధంగా ఈ నూతన శతాబ్దిలో ప్రపంచ వ్యాప్తంగా శాంతిని ప్రభోదించి, ప్రోదిచేసేందుకు ఆయా దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, ప్రజాసంఘాలు, ప్రసార సాధనాల ప్రాతినిధ్యం ఆవశ్యకను గుర్తెరిగాము.

శాంతి కాముక సమాజ స్థాపన – ప్రధానంగా ఆయా దేశాలు స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, సహనం, సంఘీభావం, సహకారం, ఏకాధిక మూలతత్వవాదం, సాంస్కృతిక వైవిధ్యం, సంవాదం, భావైక్యతలకు కట్టుబడి వున్నప్పుడే సాధ్యం కాగలదని (A, art.1, 1), అలాగే, పరిపూర్ణ స్థాయిలో శాంతి ప్రతిష్టాపన జరగాలంటే అందుకు

ఆయా వ్యక్తులు, బృందాలు, జాతులలో ఇందుకు సంబంధించి విలువలు, ఆలోచనా తీరుతెన్నులు, వ్యవహార సరళి, జీవనవిధానాలే దోహదం చేస్తాయన్న (A, art.2) సంగతి మాకు తెలియందికాదు.

## కనుకనే ......

ఈ దిగువ పేర్కొన్న అంశాలపై ప్రత్యేక దృష్టి నిలుపుతూ శాంతి ప్రతిష్టాపన కోసం రూపొందించబడిన కార్యాచరణ ప్రణాళిక పరిపూర్ణ సాఫల్యతకోసం మేము కృషిచేయ సంకల్పించాము :–

అ) విద్య : ఎల్లెడలా శాంతి నెలకొనాలంటే ప్రజలందరికీ అన్ని స్థాయిలలో జీవన పర్యంతం విద్యా బోధన గఱపాలి (A, art.4); అందరికీ విద్య అన్న లక్ష్యాన్ని జన బాహుళ్యంలో ప్రచారం చేసేందుకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో మరింత కృషి జరగాలి (D, art.9,a); చిరు ప్రాయం నుండే బాలలకు విద్యావకాశాలను మెరుగుపర్చి, విద్య యొక్క ప్రయోజనాలను తెలియ జెప్పటమే గాక వారికి విద్యా విషయకమైన విలువలు, ఆలోచనా తీరుతెన్నులు, వ్యవహార సరళి, జీవనవిధానాలలో అవగాహన కల్గించాలి (E, art.9,b); వారిలో నిబిడీకృతమైయున్న సృజనాత్మక శక్తిని వెలికితీసి, కళలకు కౌశలానికి పదునుపెట్టి, క్రీడావ్యాసాంగాలలో రాణించేలా బాలలను తీర్చి దిద్దడంతోపాటు ఉన్నత విద్యా సంస్థల ద్వారా విద్యా విషయకంగా జరిగే చొరవను మరింత విస్తృతపర్చాలి (B, art.9,h).

ఆ) సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో స్వావలంబన : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో చేపట్టే వివిధ కార్యక్రమాల ద్వారా పేదరికాన్ని రూపుమాపాలి (B, art.10,a); ఆర్థిక, సాంఘిక అసమానతలను తొలగించేందుకు స్వీయ సామర్థ్యాలకు ఊతమివ్వాలి (B, art.10,b); బాహ్య రుణాలపై ఆధారపడే దుస్థితినుండి బయట పడేందుకు సమర్థవంతమైన, సజావైన, శాశ్వత పరిష్కారాలను ప్రోత్సహించాలి (B, art.10,c); ఆశించిన అభివృద్ధి ప్రక్రియ యావత్తూ ప్రాతినిధ్య ప్రాతిపదికన పరిపూర్ణ స్థాయిలో సాగేలా చూడాలి (B, art.10,e).

ఇ) మానవ హక్కులు, ప్రజాస్వామ్యం : " వియన్నా డిక్లరేషన్ " కార్యాచరణ ప్రణాళికను పూర్తిగా అమలుపరచాలి (B, art.11,a); అన్ని రకాల మానవ హక్కులను బలపర్చి, పరిరక్షించేందుకు వీలుగా జాతీయ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనకు పూనుకోవాలి (B, art.11,b); మానవ హక్కుల సార్వత్రిక వడంబడికకు అన్ని స్థాయిలలో మద్ధత్తు ప్రకటించి ప్రచారం చేయాలి (B, art.11,f).

ఈ) స్త్రీ - పురుష సమానత్వం : ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిష్కారాల ద్వారా లింగ వివక్షను రూపుమాపడం, పురుషులతో సమంగా అతివల ఔన్నత్యాన్ని పెంచి మహిళాభ్యున్నతి సాధనకు స్త్రీలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పించడం (B, art.12,d); అబలలపై జరుగుతున్న అత్యాచారాలు, అమానుషాలకు చరమ గీతం పాడేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవడం.

ఉ) జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రజా పాలన : నియత, సంస్థాగత, అనియత విద్యా బోధనలకు సంబంధించిన అన్ని స్థాయిలలోను (B, art.13, b), అలాగే ప్రభుత్వ అధికారుల మధ్య (B, art.13, c) ప్రజాస్వామ్య విలువలు, సిద్ధాంతాలు, సాంప్రదాయాలను ప్రోత్సహించేందుకు అవశ్య చర్యలు గైకొనడం.

ఊ) ప్రవర్తన : "ఐక్యరాజ్య సమితి ఓర్మి వత్సరపు" (1995) కార్యాచరణ ప్రణాళిక సూచించిన దిశా నిర్దేశానుసారం పట్టుదలతో ముందుకు సాగేందుకు (B, art.14, a); "అంతర్జాతీయ ప్రాపంచిక స్వజాతి ప్రజా దశాబ్ధి" లక్ష్యాల సాధనకు మద్ధత్తు ప్రకటించి (B, art.14,e); శరణార్థులు, నిరాశ్రయుల విషయంలో (B, art.14, f), వలస వచ్చిన వారి పట్ల (B, art.14, g), సహనం, ఏకీభావాలను పాదుకొల్పేందుకు ; అదనుకుతగ్గ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ మానవాళిలో అవగాహన, సహనం, సహకార భావాలను ప్రోదిచేసి పెంపొందించేందుకు, సదరు వృత్తాంతాన్ని జన బాహుళ్యంలోకి తీసుకు పోయేందుకు (B, art.14, h).

ఎ) **సమాచారం, సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం :** పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం (B, art.15, d); సమాచార మాధ్యమంలో హింసకు తావులేకుండా సహకరించడం (B, art.15, e); సమాజంలో శాంతిని పాదుకొల్పేందుకు వీలుగా ప్రసార సాధనాలకు సహకరించడం (B, art.15, a); ఇంటర్నెట్‌తో సహా అన్ని రకాల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సమాచార రంగాన్ని జన బాహుళ్యం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలను ముమ్మర పర్చడం (B, art.15, f).

ఏ) **సంస్థలు :** శాంతి ప్రతిష్టాపనను ప్రపంచ వ్యాప్త ఉద్యమంగా కొనసాగించేమదుకు కీలక పాత్రధారుల మధ్య సయోధ్యను బలపరచి, ప్రోత్సహించడం (B/A, art.6); సమాచార మార్పిడికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం (B/A, art.7).

ఐ) ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేర ప్రవృత్తి, అవినీతి, మాదక ద్రవ్యాల ఉత్పత్తి పంపిణీ వినిమయం, వంటి సామాజిక రుగ్మతలను మట్టుబెట్టడం (B, art.13, e).

పైన పేర్కొన్న ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు మేము మా శక్తి, అధికారాల మేరకు, సంస్థలు లేదా వ్యక్తిగత కార్యకలాపాల పరిధి మేరకు అనవరతం శ్రమిస్తూ ఎప్పటికప్పుడు మరింత మంది కొత్త వారిని మాతో కలుపుకుంటూ ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.

ఐక్యరాజ్య సమితి తన "శతాబ్ది సదస్సు" లో ప్రత్యేకించి పేర్కొన్న రీతిగా – ఆర్థిక ప్రగతిలో ప్రధాన లబ్ధిదారులు, కీలక భాగస్వాములు ప్రజలేనన్న సత్యాన్ని గుర్తించిన సరికొత్త సామాజిక కట్టుబాటు; ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్న వినూత్న ప్రకృతి–పర్యావరణ ఒప్పందంలోని దీర్ఘకాలిక దృక్పథం; మానవాళికి పారంపర్యంగా సంక్రమిస్తున్న సాంస్కృతిక సమైక్యత, అపార వైవిధ్యాల కారణంగా ఒనగూడుతూ వచ్చిన నష్టాలు, సృజనాత్మకతల పరిరక్షణకు ఊతమిచ్చే కొంగ్రొత్త సాంస్కృతిక సమీకరణ ; వ్యక్తిగత లేదా సమిష్టి ప్రవర్తనా నియమావళికి పునాదిగా భాసిల్లే మానవీయ విలువలు, సూత్రాల పరిపూర్ణ ప్రాభవత్యాన్ని పరిరక్షించే నవ్య నైతిక నిబంధనలన్న – ఈ నాలుగు ప్రత్యగ్ర ప్రబంధాల ఆధారంగా స్వీయ సముత్థానపు వసుధైక ప్రణాళికను దీమన పర్చాల్సిన ఆవశ్యకతను మేము ప్రఖ్యాపనం చేస్తున్నాము. ఒక్క మాటలో చెప్పాలంటే – అంతర్గత పరిజ్ఞానము, సామర్థ్యాలను వినిమయంలోకి తెచ్చి జగదేక స్వీయ సంప్రస్థానాన్ని సాధించాలన్నదే మా అభిలాష.

ప్రాపంచీకరణ నేపథ్యంలో మానవ మనుగడను పదికాలాలపాటు పదిలపర్చేందుకు చుక్కాని కాగల సర్వతోముఖ ప్రగతి కోసం పేదరిక నిర్మూలన పోరును మన నైతిక బాధ్యతగా స్వీకరిద్దాం. ఈ చర్యలను విశ్వవ్యాప్తంగా అమలుపరుస్తూ, ఐక్యరాజ్యసమితిని యావత్ ప్రపంచపు ప్రజాస్వామ్య సమూహారంగా బలపరుస్తూ, నూతన ప్రవర్తనా నియమావళి, నైతిక కట్టుబాట్లతో ప్రస్తుత ప్రపంచ గమనాన్ని తిరగదిప్పేందుకు మనం కంకణ బద్ధులమై ముందుకుసాగుదాం. అధికార లాలసత్వం, బలప్రయోగాల అనాగరిక స్థితినుండి బయటపడి శాంతి, అహింస, సహనం, సద్భావం అనే సర్వోన్నత విలువలతో కూడిన నూతన ప్రపంచాన్ని నిర్మించేందుకు మనమంతా అలుపెరుగక పరిక్రమిద్దాం. భావితరాల సుఖ సంతోషాల కోసం మనిషిగా మనం చేయగల సహాయం ఇదొక్కటే.


తెలుగు సేత :

బి. డి. యం. అంబేద్కర్

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ

భారత ప్రభుత్వము

fpodfp@hotmail.com